ఆరిపోయిన గృహ'జ్యోతి'

- పెండింగ్ బిల్లులు వసూలు చేయాలని ఉత్తర్వులు
- జీరో బిల్లు వస్తేనే గృహజ్యోతి వర్తించినట్టు లెక్క
- ఫిబ్రవరి నుంచి బకాయిలు చెల్లించాల్సిందే
- జగిత్యాలలో 50 వేలకు పైగా పెండింగ్ కనెక్షన్లు
- బకాయిలు రూ. 7.25 కోట్ల పైమాటే
- మోసపోయామని వినియోగదారుల ఆవేదన

జగిత్యాల, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు చెప్పుకుంటున్న ప్రతి పథకం లోపభూయిష్టంగానే కనిపిస్తున్నది. ఒక విధానం అంటూ లేకుండా ఇష్టారాజ్యంగా అమలు చేస్తున్న పథకాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించే వారికి కరెంట్ బిల్లులు మాఫీ చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. అయితే, విద్యుత్తుశాఖకు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను పరిశీలిస్తే.. గృహజ్యోతి పథకం సైతం ఆరిపోయినట్టుగానే కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించిన వారి కరెంట్ బిల్లులను షరతులు లేకుండా మాఫీ చేస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మార్చి నెల నుంచి గృహజ్యోతి పథకం అమలును ప్రారంభించింది. అయితే, చాలామంది లబ్ధిదారులకు పథకం వర్తించలేదు. మార్చిలో జగిత్యాలలో వేలమందికి పథకం వర్తించలేదు. రాష్ట్రవ్యాప్తంగానూ ఎంతోమంది అర్హులకు కరెంటు బిల్లులు వచ్చాయి. దీంతో నిరసనలు వెల్లువెత్తాయి. స్పందించిన ప్రభుత్వం అర్హులు ఎవరూ బిల్లులు చెల్లించాల్సిన పనిలేదని, అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కోరింది. బిల్లులు చెల్లించక్కర్లేదని సీఎం నుంచి కలెక్టర్ల వరకు అందరూ చెప్పడంతో వినియోగదారులు బిల్లు చెల్లించడం మానేసి పథకానికి మరోమారు దరఖాస్తు చేసుకున్నారు.

పెండింగ్ బిల్లులు వసూలు చేయాలని ఆదేశాలు

దాదాపు ఆరు నెలలుగా జీరో బిల్లు జనరేట్ కాని వారికి సంబంధించిన బకాయిలను వినియోగదారుల నుంచి వసూలు చేయాలని ప్రభుత్వం నుంచి విద్యుత్తుశాఖకు ఉత్తర్వులు అందాయి. జీరో బిల్లు ఎప్పటి నుంచి జనరేట్ అవుతోందో అప్పటి నుంచే గృహజ్యోతి పథకం వర్తిస్తుందని, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించి జీరో బిల్లు రానివారి నుంచి బిల్లులు వసూలు చేయాలని ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన విద్యుత్తు అధికారులు బకాయిల వసూలుకు నడుంబిగించారు.

50 వేల కనెక్షన్లలో బకాయిలు

ఒక్క జగిత్యాలలోనే బిల్లు చెల్లించని బిల్లులు చెల్లించని లబ్ధిదారుల సంఖ్య 50 వేల వరకు ఉంటుందని అంచనా. జగిత్యాల జిల్లా పరిధిలో గృహ అవసరాలకు సంబంధించి 3,29,043 మంది వినియోగదారులు ఉన్నారని, వీరిలో 1,99,270 మందికి గృహజ్యోతికి సంబంధించిన జీరో బిల్లు జనరేట్ అయిందని చెప్తున్నారు. అంటే, 50,338 బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో వారి నుంచి ఈ ఆరు నెలలకు సంబంధించి రూ.7.25 కోట్లు వసూలు చేయాల్సి ఉందని అంటున్నారు.

లబోదిబోమంటున్న వినియోగదారులు

గృహజ్యోతి పథకంలో అర్హులైన వినియోగదారుల నుంచి పెండింగ్ బిల్లులు వసూలు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ప్రజలు లబోదిబోమంటున్నారు. అర్హత ఉన్నవారికి బిల్లులు మాఫీ చేస్తామని, కరెంట్ బిల్లులు కట్టాల్సిన అవసరం లేదని చెప్పడం, ఆరు నెలలు గడిచాక తీరా ఇప్పుడు మొత్తం బిల్లులు ఒకేసారి చెల్లించాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంతా మోసం

మాది జగిత్యాల. నా భర్త ఎనగంటి రవి కుమార్. ఔసుల పని చేస్తడు. నేను బీడీ కార్మికురాలిని. మాకు ముగ్గురు పిల్లలు. మేం శ్రీరాంనగర్‌లో కిరాయికి ఉంటున్న. నాలుగు బల్బులు, మూడు ఫ్యాన్లు మాత్రమే ఉన్నయ్. పెద్దగా కరెంట్ వాడకం ఉండదు. బిల్లుకూడా ఎక్కువ రాదు. గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నా జీరో బిల్లు రాలేదు. సీఎం, మంత్రులు చెప్తున్నరని మున్సిపల్ ఆఫీస్‌కు వెళ్లి మళ్లీ దరఖాస్తు చేసుకున్నం. అయినా ఆరు నెలల నుంచి నెలనెలా బిల్లు వస్తూనే ఉంది. ఏ నెల కూడా మేం 200 యూనిట్లకు ఎక్కువ వాడుకోలే. మాఫీ అయితయని అనుకున్నం. మొన్న కరెంట్ బిల్లు వచ్చింది. 93 యూనిట్లు వాడుకున్నందుకు రూ. 320 వచ్చింది. ఈ బిల్లుతో పాటు, పాత ఐదు నెలల బిల్లుల బకాయిలు మొత్తం రూ.1800 కట్టాలని బిల్లు ఇచ్చినాయన చెప్పిండు. లేదంటే కరెంటు కట్ చేస్తమని చెప్పి వెళ్లిండు. ఇదేం పద్ధతి.. ఇదేం లెక్క.. మాఫీ అంటిరి. బిల్లు కట్టకుండ్రి అంటిరి. ఇప్పుడు ఒకటేసారి ఆరు నెలల బిల్లు కట్టమంటే ఎట్ల? సర్కార్ ముచ్చటనే అర్థమైత లేదు.

–ఎనగంటి మౌనిక, గృహిణి, జగిత్యాల

సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు: భట్టి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు ఖరారు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సిటీ పోలీస్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024ను భట్టి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కంటే తమిళనాడు, కర్ణాటకలో సెక్యూరిటీ గార్డుల వేతనాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో దేశంలోనే ఉత్తమమైన వేతనాలను సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ అనేది వేగంగా విస్తరిస్తున్న రంగమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు 3.5 లక్షలు వరకు ఉండగా, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు 4 లక్షల మంది ఉన్నట్టు తెలిపారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాలతోపాటు వివిధ అంశాల్లో వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌కు ఈ బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లు కేటాయించినట్టు గుర్తుచేశారు. రీజనల్ రింగ్ రోడ్డు, ఫోర్త్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతిచోట పోలీసుల కంటే ప్రైవేట్ సెక్యూరిటీ ఎక్కువగా కనిపిస్తుందని, పారిశ్రామిక, పట్టణీకరణతో వీరి పాత్ర మరింత పెరుగనున్నదని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఏడీజీ(శాంతిభద్రతలు)మహేశ్ భగవత్, ఏసీపీ విక్రమ్ సింగ్ మాన్, ప్రతినిధులు పాల్గొన్నారు

గ్రూప్-1 మెయిన్ వాయిదా వేయండి

- 'ప్రిలిమినరీ'పై ఉన్న కేసులు పరిష్కరించండి
- టీజీపీఎస్సీ చైర్మన్‌కు అభ్యర్థుల వినతి

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్ పరీక్షనాటికి ప్రిలిమినరీ పరీక్ష 'కీ'పై వివిధ కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించాలని, సాధ్యంకాని పక్షంలో మెయిన్ పరీక్షను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయనకు వేర్వేరుగా లేఖలు అందజేశారు. షెడ్యూల్ ప్రకారం గ్రూప్-1 మెయిన్ పరీక్ష అక్టోబర్ 21న ఉన్నదని అభ్యర్థులు తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష 'కీ'లో దొర్లిన తప్పులపై పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారని గుర్తుచేశారు. ఆ కేసులన్నింటినీ మెయిన్ పరీక్షనాటికి పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీ సంతోష్, ప్రశాంత్‌రెడ్డి, సాయికృష్ణ, నరేశ్, అరుణ్‌కుమార్, నిశాంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, రవి, భద్రు, చంద్రమౌళి, వినోద్‌కుమార్, కిరణ్, సంపత్ పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన కాలేజీల్లోనే చేరండి

- నమస్తే తెలంగాణ కథనానికి స్పందించిన ఇంటర్‌బోర్డు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): గుర్తింపు పొందిన కాలేజీలోనే విద్యార్థులు చేరాలని ఇంటర్‌బోర్డు సూచించింది. గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, వాటిలోనే అడ్మిషన్లు పొందాలని కోరింది. 'ఆ విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం' పేరుతో శుక్రవారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. ఇప్పటివరకు 340కి పైగా కాలేజీలు గుర్తింపును దక్కించుకోకపోవడం, ఆయా కాలేజీల్లో లక్షలకుపైగా విద్యార్థులున్నారని ప్రస్తావించింది. దీంతో ఇంటర్‌బోర్డు డైరెక్టర్ శృతి ఓజా శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్ ప్రవేశాల గడువును 7 వరకు పొడగించామని పేర్కొన్నారు. ఇదే చివరి అవకాశమని, అర్హులైన విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు.

ప్రభుత్వరంగ సంస్థలకు ఐఆర్ ఎప్పుడు?

- 8 నెలలుగా ఉద్యోగుల ఎదురుచూపులు

హైదరాబాద్, ఆగస్టు30 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందుగా తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు ఐఆర్‌ను ప్రకటించింది. అది ఇప్పటికీ ప్రభుత్వ రంగసంస్థలు, సమాఖ్యలు, సహకార సంఘాల్లో అమలు చేయని పరిస్థితి నెలకొన్నది. ఆయా సంస్థల్లోని ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి పీఆర్‌సీ పదవీకాలం జూలై 2022తో ముగియడంతో 2023అక్టోబర్‌లో రెండో పీఆర్‌సీని ఏర్పాటు చేశారు. 5శాతం ఐఆర్‌ను ప్రకటించారు. అయితే ఐఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార సంఘాలు, ఫెడరేషన్లు, విశ్వవిద్యాలయాల బోధనేతర సిబ్బందికి మాత్రం చెల్లించడం లేదు. దీనిపై ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అనేక పర్యాయాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండాపోయింది. ఇదే విషయమై ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా, ఆయా సంస్థల్లోని ఉద్యోగులకు సైతం ఐఆర్ చెల్లించాలని ఆర్థికశాఖకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదేశాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం గమనార్హం.

ఏనుమాముల మార్కెట్‌కు కొత్త పత్తి

- క్వింటాకు రూ.7,011

కాశీబుగ్గ, ఆగస్టు 30: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం కొత్త పత్తి వచ్చింది. సాధారణంగా అక్టోబర్ నుంచి కొత్త పత్తి మార్కెట్‌కు వస్తుంది. మద్దతు ధర కూడా అప్పుడే ప్రారంభమవుతుంది. ఈ సారి నెల రోజుల ముందే పత్తి మార్కెట్‌కు రావడంతో రైతులు, కార్మికులు, వ్యాపారులు సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు కాంటాలకు పూజలు చేసి పత్తి కొనుగోలుకు కాంటా పెట్టారు. కేంద్రం క్వింటాకు మద్దతు ధర రూ. 7521 ప్రకటించగా.. ఏనుమాముల మార్కెట్‌లో క్వింటాకు రూ.7011 ధర పలికింది. హనుమకొండ జిల్లా ఐలోని మండలం వెంకటాపూర్‌కు చెందిన పిండి రవి 8 బస్తాలు తీసుకురాగా.. కుమారస్వామి అడ్డి ద్వారా గోకుల్ కాటన్ వ్యాపారి కొనుగోలు చేశారు. పాత పత్తికి క్వింటాకు రూ.7,500 ధర పలికింది.

హామీలు నెరవేర్చాకే.. భట్టి రావాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్

గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని ఆగస్టు 30: సింగరేణి కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాకనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గోదావరిఖని పర్యటనకు రావాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.20 లక్షల వడ్డీలేని రుణం హామీలను అమలు చేస్తారో? లేదో? చెప్పాలన్నారు. బొగ్గు గనుల వేలంలో పాల్గొంటారా? లేక కేంద్రంతో మాట్లాడి తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించేలా ఒప్పిస్తారా? అనేది డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది సింగరేణి 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిన నేపథ్యంలో కనీసం 4000 కోట్ల లాభాలు వచ్చే అవకాశం ఉన్నదని చెప్పారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడిచినా సింగరేణి లాభాలను ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. తక్షణమే లాభాలు ప్రకటించి ప్రతి కార్మికుడికి 35శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాకులను ప్రైవేట్ పరం చేస్తారా? కార్మికులకు అప్పగిస్తారా? తేల్చిచెప్పాలన్నారు. ప్రభుత్వమే గనుల వేలంలో పాల్గొనాలని కొన్ని కార్మిక సంఘాలు కోరడం విడ్డూరమని, సింగరేణి యాజమాన్యంతో లోపాయికారితనంతోనే ఈ విధంగా మాట్లాడుతున్నాయని ఆక్షేపించారు. సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, సీనియర్ వైఎస్ ప్రెసిడెంట్ కొమురయ్య, నాయకులు శ్రీనివాస్, పల్లె సురేందర్, సాయి, పులిపాక శంకర్, రోడ్డ సంపత్, గుండు శ్రావణ్, కొమురయ్య పాల్గొన్నారు. వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో టీబీజీకేఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీపై డిప్యూటీ సీఎం స్పష్టత ఇవ్వాలని, సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బాకీ పడిన రూ.29 వేల కోట్లను చెల్లించాలని, వెంటనే లాభాల వాటా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సింగరేణిలో బదిలీ వర్కర్లకు తీపికబురు

2,364 మంది జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణకు ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : సింగరేణిలో బదిలీ వర్కర్లకు సంస్థ శుభవార్త చెప్పింది. 2,364 మందిని జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్టు సీఎండీ బలరాం తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించనున్నట్టు వెల్లడించారు. సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలో తొలుత బదిలీ వర్కర్లుగా తీసుకుంటారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఆయా బదిలీ వర్కర్లు సంవత్సరంలో 190 రోజులు భూగర్భగనుల్లో, ఉపరితల గనులు, ఇతర విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహిస్తే వారిని జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ చేస్తారు. సీఎండీ బలరాం మాట్లాడుతూ.. జనరల్ మజ్దూర్లుగా ఎంపికైనవారు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

ఫార్మాసిటీ భూసేకరణపై ప్రభుత్వం అప్పీల్

- ఏడాది ఆలస్యంపై రైతుల అభ్యంతరం
- విచారణ 2 వారాలకు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఫార్మాసిటీ భూసేకరణపై మళ్లీ అభ్యంతరాలు స్వీకరించాలంటూ నిరుడు ఆగస్టులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయిలో రద్దు చేయకుండా పరిహార ప్రకటనను మాత్రమే నిలిపివేస్తూ సింగిల్ జడ్జి తీర్పు చెప్పారని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఆ తీర్పు వెలువడే నాటికి ఉన్న మార్కెట్ విలువ ప్రకారంగా యాచారం మండలంలోని మేడిగడ్డ గ్రామ రైతులకు పరిహారం చెల్లించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాది స్పందిస్తూ.. సింగిల్ జడ్జి తీర్పుపై ప్రభుత్వం తీరుబడిగా ఏడాది తర్వాత అప్పీల్ వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ అప్పీల్‌ను కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో అప్పీల్ దాఖలు జాప్యమవడంపై అడ్వకేట్ జనరల్ క్షమాపణ చెప్పారు. అనంతరం ప్రభుత్వ అప్పీల్‌పై తమకున్న అభ్యంతరాలను వివరిస్తూ కౌంటర్ వేస్తామని పిటిషనర్ల న్యాయవాది చెప్పడంతో తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

అమ్మో.. ఒకటో తారీఖు!

జీతాలు అందక చిరుద్యోగుల విలవిల

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : వారంతా చిరుద్యోగులు. ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్నామన్న పేరే తప్ప ఉద్యోగ భద్రత ఉండదు. నెలంతా పనిచేస్తే వచ్చేది రూ.15 నుంచి 20వేల లోపే. శ్రమదోపిడీకి చిరునామాగా మారిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రేవంత్ సర్కారు ముప్పుతిప్పలు పెడుతోంది. నెలంతా పనిచేస్తే ఇవ్వాల్సిన వేతనాలు, గౌరభృతి, పారితోషికాలను చెల్లించడం లేదు. ఒకటో తారీకున జీతాలిస్తామన్న రేవంత్ ప్రభుత్వం కొలువుదీరి 8 నెలలు గడిచినా పరిస్థితిలో మార్పురాలేదు. రాష్ట్రంలోని కొంతమంది ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలు అందడం లేదు.

వేతనాలు అందనిది వీరికే..

- మోడల్ స్కూళ్లలోని అవర్లీ బేస్డ్ టీచర్లకు జూలై వేతనం అందలేదు. మరో 17 పాఠశాలల్లో జూన్ వేతనం ఇప్పటికీ అందని ద్రాక్షలాగా మారింది. ఇదే మోడల్ స్కూళ్లలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు.
- ఇంటర్ విద్యలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు.
- కేజీబీవీ టైప్-4 సిబ్బందికి గత నాలుగు నెలలుగా వేతనాలు రాలేదు.
- గురుకులాల్లో గెస్ట్ ఫ్యాకల్టీకి జూన్, జూలై, ఆగస్టు మాసాల వేతనం అందలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీల్లోని బోధనా సిబ్బందిదీ ఇదే పరిస్థితి.
- స్పోర్ట్స్ అకాడమీల్లో పనిచేస్తున్న సిబ్బంది మూడు నెలలుగా వేతనాలు పొందలేదు.
- వైద్యశాఖలోని టీవీవీపీ పరిధిలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు అందలేదు. ప్రభుత్వం ఏజెన్సీలకు ఫిబ్రవరి వరకు బిల్లులు చెల్లించింది. ఆ తర్వాత పెండింగ్ పెట్టడంతో కాంట్రాక్టర్లు సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వ లేదు.

పని చేస్తున్నాం.. వేతనం వస్తదా?

- టీవీవీపీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన
- కొనసాగింపు ఉత్తర్వుల్లో రెండు నెలలుగా జాప్యం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : 'తమ ఒప్పంద సేవలను కొనసాగిస్తూ ఇప్పటివరకు ఉత్తర్వులు రాలేదు. అయినా రెండు నెలలుగా పని చేస్తున్నాం. మాకు జీతం వస్తుందా? లేదా? అని వైద్యశాఖలోని టీవీవీపీ పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన ఇది. టీవీవీపీ(తెలంగాణ వైద్య విధాన పరిషత్)పరిధిలో దాదాపు 6 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈసీజీ, ఎక్స్‌రే టెక్నీషియన్లు, డ్రైవర్లు, ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో, బార్బర్లు.. ఇలా పలు విభాగాల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. ఏటా మార్చి నుంచి మార్చి వరకు వీరి ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. అయితే, ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం వీరి ఒప్పందాన్ని పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వలేదు. గతంలో ఈ విషయాన్ని వైద్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎన్నికల వేళ సాధ్యం కాదంటూ.. పాత ఒప్పందాన్ని మరో మూడు నెలలు పొడిగించారు. జూన్‌తో ఇది కూడా ముగిసింది. దీంతో రెండు నెలలుగా ఉద్యోగులు ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే విధుల్లో కొనసాగుతున్నారు. రెండు నెలలుగా వీరికి వేతనాలు కూడా అందలేదు. ఎలాంటి ఉత్తర్వులు లేకున్నా పనిచేస్తున్నామని, ఈ రెండు నెలల జీతం ఇస్తరో లేదోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

16ఏండ్లుగా పని చేస్తున్నాం

రాష్ట్రవ్యాప్తంగా 16 ఏండ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా కొనసాగుతున్నాం. ఈ సంవత్సరం ఇంకా ఆర్డర్ రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి. తమకు రావాల్సిన రెండు నెలల పెండింగ్ వేతనం ఇవ్వాలి.

– బైరపాక శ్రీనివాస్, యూఎంహెచ్‌ఈయూ రాష్ట్ర కార్యదర్శి

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ఘోర అవమానం

- ఎంపీ చామల, మల్లన్న, వేములను అడ్డుకున్న పోలీసులు
- చెయ్యిపై, భుజంపై చెయ్యేసి పక్కకు లాగిన వైనం
- అలిగి వెళ్లిపోయిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల
- పోలీసులకు కామన్ సెన్స్ ఉండదా అంటూ అసహనం

భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి బతిమిలాడుతున్నా వెనక్కి వెళ్లిపోతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లాలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ఘోర అవమానం జరిగింది. ఓ కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని పోలీసులు వేర్వేరుగా అడ్డుకున్నారు. శుక్రవారం భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నీటిపారుదల పనుల పురోగతిపై సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెలికాప్టర్‌లో భువనగిరికి చేరుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హెలిపాడ్ వద్దకు వేర్వేరుగా వెళ్తుండగా, మెటల్ డిటెక్టర్ పాయింట్ వద్ద గుర్తించని పోలీసు అధికారులు వారిని అడ్డుకున్నారు. చెయ్యి, భుజం పట్టుకొని పక్కకు నెట్టారు. దాంతో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోతుండగా అక్కడే ఉన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బుజ్జగించి వెనక్కి రప్పించే ప్రయత్నం చేశారు. అయినా ఆయన వినిపించుకోలేదు. 'పోలీసులకు కామన్ సెన్స్ ఉండదా? ఎవరు ఎమ్మెల్యే, ఎవరు కాదు అనేది తెల్వదా?' అంటూ వీరేశం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత స్వాగతం పలికేందుకు రావాలని పలువురు ఆయనకు ఫోన్ చేసినా రాకుండా వేదికపైనే ఉండిపోయారు. ఇదే సమయంలో ఏసీపీతో తీన్మార్ మల్లన్న పంచాయితీ పెట్టుకున్నారు. మా జిల్లాలో పని చేస్తూ మమ్మల్ని గుర్తుపట్టరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ముఖాలు చూడుర్రి.. బట్టలు చూడకుర్రి' అంటూ ఎంపీ చామల అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ప్రజావాణికి 680 దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 680 దరఖాస్తులు అందినట్టు అధికారులు పేర్కొన్నారు. ఎస్సీ వెల్ఫేర్ 215, విద్యుత్ 98, రెవెన్యూ 94, మైనారిటీ వెల్ఫేర్ 90, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 64, ఇతర శాఖలకు సంబంధించి 119 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు.

పీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సులోని సీట్ల భర్తీకి నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 3న అర్హులైన వారి జాబితాను ప్రదర్శిస్తారు. 4, 5న వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 6న ఆప్షన్లు సవరించుకోవచ్చు. 8న సీట్లను కేటాయిస్తారు. సీట్లు పొందినవారు 9 నుంచి 12 వరకు రిపోర్ట్‌